నేటి మ్యాచ్‌లు: గుజరాత్ X చెన్నై, మ.3.30 నుంచి, వేదిక అహ్మదాబాద్ | కోల్‌కతా X హైదరాబాద్, రా.7.30 నుంచి, వేదిక ఢిల్లీ

# పంజాబ్‌కు షాక్

రాణించిన రిజ్వీ, కరణ్‌నాయర్ • ముస్తాఫిజుర్‌కు మూడు వికెట్లు

## ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం




జైపూర్: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ బెర్తులు దక్కించుకున్న జట్లకు వరుస షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)కు సన్‌రైజర్స్ హైదరాబాద్ షాక్ ఇవ్వగా, తాజాగా పంజాబ్ కింగ్స్ టాప్ ప్లేస్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ నీళ్లు గుమ్మరించింది. ఢిల్లీపై గెలిచి అగ్రస్థానంలోకి దూసుకెళుదామనుకున్న పంజాబ్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్‌పై అద్భుత విజయం సాధించింది. పంజాబ్ నిర్దేశించిన 207 పరుగుల లక్ష్యఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 208/4 స్కోరు చేసింది. సమీర్ రిజ్వీ(25 బంతుల్లో 58 నాటౌట్, 3ఫోర్లు, 5సిక్స్‌లు), కరణ్‌నాయర్(44), కేఎల్ రాహుల్(35) రాణించారు. బ్రార్(2/41)కు రెండు వికెట్లు దక్కాయి. తొలుత కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(34 బంతుల్లో 53, 3ఫోర్లు, 2సిక్స్‌లు), స్టాయినిస్(16 బంతుల్లో 44 నాటౌట్, 3ఫోర్లు, 4సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 206/8 స్కోరు చేసింది. రెహమన్(3/33) మూడు వికెట్లతో రాణించాడు. రిజ్వీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**అయ్యర్, స్టాయినిస్ అదుర్స్:**

లీగ్‌లో మంచి ఫామ్‌మీదున్న ప్రియాంశ్ ఆర్య(6) స్వల్ప స్కోరుకే వెనుదిరుగడంతో పంజాబ్‌కు సరైన శుభారంభం దక్కలేదు. ఫస్ట్ డౌన్‌లో వచ్చిన ఇంగ్లిస్(32), ప్రభ్‌సిమ్రన్ సింగ్(28) పంజాబ్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వచ్చి రావడంతోనే ఇంగ్లిస్..ఢిల్లీ బౌలర్లను లక్ష్యంగా చేసుకుంటూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన విప్రాజ్ నిగమ్ స్పిన్ తంత్రంలో ఇంగ్లిస్ ఇరుక్కుపోయాడు. తొలి రెండు బంతులను బౌండరీలుగా మలిచిన ఇంగ్లిస్..నిగమ్ వేసిన గూగ్లీని సరిగ్గా అర్థం చేసుకోకుండా ముందుకు ఆడే ప్రయత్నంలో స్టంపౌట్ అయ్యాడు. ఆ తర్వాత 20 పరుగుల తేడాతో ప్రభ్‌సిమ్రన్ కూడా నిగమ్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. ఈ దశలో అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మధ్యలో రెహమన్ ధాటికి శశాంక్(11), వదేరా(16) ఇలావచ్చి అలా వెళ్లారు. ఆఖర్లో స్టోయినిస్ మెరుపులతో అదరగొట్టాడు. మోహిత్‌శర్మను లక్ష్యంగా చేసుకుంటూ ఒకే ఓవర్లో 22 పరుగులు కొల్లగొట్టాడు. ఈ క్రమంలో 16 బంతుల్లోనే 3ఫోర్లు, 4 భారీ సిక్స్‌లతో 44 పరుగులు ఖాతాలో వేసుకున్నాడు.

**రిజ్వీ ధనాధన్:**

ఓపెనర్లు రాహుల్(35), కెప్టెన్ డుప్లెసిస్(23) తొలి వికెట్‌కు 55 పరుగులు జతచేశారు. వీరిద్దరు పంజాబ్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను నిర్మించారు. అయితేయాన్సెన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన రాహుల్..శశాంక్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత 10 పరుగుల తేడాతో డుప్లెసిస్‌ను బ్రార్ రెండో వికెట్‌గా పెవిలియన్ పంపాడు. కరణ్‌నాయర్, అటల్(22) ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ సింగిల్స్‌తో స్ట్రైక్ రొటేట్ చేశారు. బ్రార్ బౌలింగ్‌లో నాయర్ క్లీన్‌బౌల్డ్ కాగా, దూబే బౌలింగ్‌లో అటల్ వెనుదిరిగాడు. గెలుపుపై ఆశలు సన్నగిల్లుతున్న వేళ సమీర్ రిజ్వీ, స్టబ్స్ సమీకరణాలను మార్చేశారు. స్టబ్స్ సహకారంతో రెచ్చిపోయిన రిజ్వీ అజేయ అర్ధసెంచరీతో ఢిల్లీకి అద్భుత విజయాన్ని కట్టబెట్టాడు. పంజాబ్‌కు షాక్ ఇచ్చిన ఢిల్లీ ఈ సీజన్‌ను కిక్కించే గెలుపుతో ముగించింది.

# టెస్టు కెప్టెన్ గిల్

భారత టెస్టు బాధ్యతలు యువ క్రికెటర్‌కు • వైస్ కెప్టెన్‌గా రిషబ్ పంత్

సుదర్శన్, కరణ్, అర్ష్‌దీప్‌సింగ్‌కు చోటు • ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు జట్టు ఎంపిక



**5**

పిన్న వయసులో భారత కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఐదో క్రికెటర్‌గా గిల్(25 ఏండ్లు) నిలిచాడు. అలీఖాన్ పటౌడీ(21), సచిన్(23), కపిల్‌దేవ్(24), రవి శాస్త్రి(25) ముందు వరుసలో ఉన్నారు.

**భారత క్రికెట్‌లో నూతన అధ్యాయానికి అడుగులు పడ్డాయి. దిగ్గజ క్రికెటర్లు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించిన వేళ టీమ్‌ఇండియా కొత్త కలను సంతరించుకుంది. అందరూ ఊహించినట్లుగానే డాషింగ్ క్రికెటర్ శుభ్‌మన్‌గిల్‌కు భారత టెస్టు కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. గత కొన్ని రోజులుగా వస్తున్న వార్తలను నిజం చేస్తూ బీసీసీఐ..గిల్‌ను కెప్టెన్‌గా ప్రకటించింది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సమరానికి జట్టును ఎంపిక చేసిన బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రిషబ్ పంత్‌కు వైస్‌కెప్టెన్సీ ఇచ్చిన బోర్డు..ఫిట్‌నెస్, బాధ్యతలు దృష్టిలో పెట్టుకుని బుమ్రాను పక్కకు పెట్టింది. షమీ, సర్ఫరాజ్‌ఖాన్‌కు చుక్కెదురు కాగా కరుణ్‌నాయర్, సాయి సుదర్శన్, అర్ష్‌దీప్‌సింగ్ జట్టుకు ఎంపికయ్యారు.**

ముంబై: భారత క్రికెట్‌లో నవ శకానికి నాంది పడింది. పరివర్తనలో భాగంగా దేశ క్రికెట్ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని యువ క్రికెటర్ శుభ్‌మన్‌గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేశారు. శనివారం ఇక్కడ బోర్డు ప్రధాన కార్యాలయంలో సమావేశమైన చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇటీవలే రిటైర్మెంట్ తీసుకున్న హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ వారసునిగా శుభ్‌మన్ గిల్‌ను టీమ్‌ఇండియా కెప్టెన్‌గా ఎంపిక చేసింది. గిల్‌కు డిప్యూటీగా రిషబ్ పంత్ వ్యవహరించనున్నాడు. వచ్చే నెల 20 నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకానున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం బోర్డు 18 మందితో కూడిన టీమ్‌ఇండియాను ప్రకటించింది. దిగ్గజ క్రికెటర్లు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీ ఇటీవలే టెస్టులకు వీడ్కోలు పలికిన వేళ వారి స్థానాల్లో సాయి సుదర్శన్, కరణ్‌నాయర్‌ను తీసుకున్నట్లు అగార్కర్ మీడియా సమావేశంలో పేర్కొన్నాడు. దేశ క్రికెట్‌కు ఎనలేని సేవలందించిన వారి స్థానాలను భర్తీ చేయడం కష్టమేనన్న అగర్కార్ ఈ అవకాశాన్ని యువ క్రికెటర్లు అందిపుచ్చుకోవాలని సూచించాడు. జట్టు విషయానికొస్తే ఐపీఎల్ కాకుండా దేశవాళీ ఫామ్‌ను పరిగణనలోకి తీసుకుంటూ సుదర్శన్‌ను జట్టులోకి తీసుకున్నామని అగర్కార్ స్పష్టం చేశాడు. సరిగ్గా ఎనిమిదేండ్ల తర్వాత కరుణ్ నాయర్ తిరిగి టీమ్‌ఇండియాకు ఎంపిక కాగా, ముంబై యువ బ్యాటర్ సర్ఫరాజ్‌ఖాన్‌కు చుక్కెదురైంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైన సర్ఫరాజ్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఇన్నాళ్లు కోహ్లీ ఆడిన కీలకమైన నాలుగో స్థానంలో ఎవరిని ఆడించాలనే దానిపై ఇంకా అస్పష్టత నెలకొన్నది. ఈ విషయంలో కెప్టెన్ గిల్, కోచ్ గంభీర్, టీమ్ మేనేజ్‌మెంట్ కలిసి నిర్ణయం తీసుకుంటారని అగర్కార్ స్పష్టం చేశాడు. దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న అభిమన్యు ఈశ్వరన్‌కు జట్టులో చోటు దక్కగా, ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్‌రెడ్డి తన స్థానాన్ని కాపాడుకున్నాడు.

**షమీ అన్‌ఫిట్:**

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు సీనియర్ బౌలర్ మహమ్మద్ షమీని ఎంపిక చేయలేదు. వన్డే ప్రపంచకప్‌లో గాయపడి ఇటీవలే ఐపీఎల్‌తో రీఎంట్రీ ఇచ్చిన షమీ టెస్టుల్లో ఆడే పూర్తి ఫిట్‌నెస్ అందుకోనట్లు అగార్కర్ తెలిపాడు. 'గత వారం షమీ గాయపడ్డాడు. గాయం తీవ్రత తెలుసుకునేందుకు ఎమ్‌ఆర్‌ఐ స్కానింగ్ కూడా తీశారు. టెస్టులు ఆడే ఫిట్‌నెస్ అతనికి లేదని తెలుస్తున్నది' అని అన్నాడు. స్టార్ పేసర్ బుమ్రా ఐదు టెస్టులు ఆడటం కష్టమేనన్న అగార్కర్ అతని వర్క్‌లోడ్ పరిశీలించాల్సి ఉందని పేర్కొన్నాడు. పేస్ దళానికి బుమ్రా నాయకత్వం వహించనుండగా, సిరాజ్, అర్ష్‌దీప్‌సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్ పేసర్లుగా కొనసాగనున్నారు. ఆసీస్‌తో సిరీస్‌లో ఆడిన హర్షిత్ రానాను సెలెక్టర్లు పక్కకు పెట్టారు. జడేజా, కుల్దీప్, సుందర్ స్పిన్నర్లుగా కొనసాగనుండగా, శార్దుల్ ఠాకూర్‌ను పేస్ ఆల్‌రౌండర్‌గా ఎంపిక చేశారు.

జట్టు వివరాలు: గిల్(కెప్టెన్), పంత్(వైస్ కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సుదర్శన్, ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్‌రెడ్డి, జడేజా, జురెల్, సుందర్, శార్దుల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్, అర్ష్‌దీప్‌సింగ్, కుల్దీప్‌యాదవ్.

**14.66** ఇంగ్లండ్‌లో టెస్టుల్లో గిల్ బ్యాటింగ్ సగటు ఇది.

# ఫైనల్లో శ్రీకాంత్

ఆరేండ్ల తర్వాత తొలిసారి తుది పోరుకు

మలేషియా మాస్టర్స్ టోర్నీ

కౌలాలంపూర్: భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ సత్తాచాటాడు. గత కొన్నేండ్లుగా గాయాలకు తోడు నిలకడలేమితో సతమతమవుతున్న శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తద్వారా ఆరేండ్ల వ్యవధిలో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ టోర్నీలో శ్రీకాంత్ తుదిపోరులో నిలిచాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 21-18, 24-22తో యుషి తనాకా(జపాన్)పై అద్భుత విజయం సాధించాడు. హోరాహోరీగా సాగిన పోరులో తన అనుభవాన్ని ఉపయోగించుకున్న శ్రీకాంత్..ప్రపంచ 23వ ర్యాంకర్ యుషిని వరుస గేముల్లో చిత్తుచేశాడు. 2019 ఇండియా ఓపెన్‌లో రన్నరప్ తర్వాత శ్రీకాంత్ టైటిల్ పోరుకు అర్హత సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆది నుంచే తనదైన



దూకుడు కనబరిచిన ఈ 65వ ర్యాంక్ ప్లేయర్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి గేమ్‌ను 21-18తో సొంతం చేసుకున్న ఈ మాజీ వరల్డ్‌నంబర్‌కు మలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి దీటైన పోటీ ఎదురైంది. పాయింట్, పాయింట్‌కు నువ్వానేనా అన్నట్లు పోరాటం కొనసాగింది.చివరి దశలో తనా కా తప్పు చేయడం శ్రీకాంత్‌కు కలిసొచ్చింది.

# బషీర్ స్పిన్ ధమాకా

**జింబాబ్వేపై ఇంగ్లండ్ ఘన విజయం**

నాటింగ్‌హామ్(ఇంగ్లండ్): జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లోనే ముగిసిన టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 45 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తుగా ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 30/2తో శనివారం ఫాలోఆన్‌కు దిగిన జింబాబ్వే..యువ స్పిన్నర్ షోయబ్ బషీర్(6/81) ధాటికి 255 పరుగులకు ఆలౌటైంది. మిడిలార్డర్‌లో సీన్ విలియమ్స్(88), సికిందర్ రజా(60) అర్ధసెంచరీలతో పోరాడారు. ఇంగ్లండ్ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ వీరిద్దరు సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు.

# ప్రణవ్‌కు కాంస్యం

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

షుల్(జర్మనీ): ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన పురుషుల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో యువ షూటర్ నరేన్ ప్రణవ్ కాంస్య పతకంతో మెరిశాడు. ఇటీవలే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మెరిసిన ప్రణవ్ 227.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. హువాంగ్ లివాలిన్(250.3, చైనా), బ్రాడెన్ పీజర్(250.0, అమెరికా) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. జూనియర్ వరల్డ్ చాంపియన్ పీజర్, వరల్డ్ కప్ రజత విజేత హువాంగ్ లాంటి స్టార్ షట్లర్లతో కడదాకా పోరాడిన



ప్రణవ్ చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకున్నాడు.




# సంజూ, పవన్ ముందంజ

**థాయ్‌లాండ్ ఓపెన్ బాక్సింగ్**

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నీలో భారత యువ బాక్సర్లు సంజూ ఎమ్‌ఎస్, పవన్ బర్త్వాల్ ముందంజ వేశారు. శనివారం జరిగిన మహిళల 60కిలోల విభాగంలో బరిలోకి దిగిన సంజూ 5-0 తేడాతో సారి కొకుపు(జపాన్)పై ఘన విజయం సాధించి క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో ఆర్మీమెన్ పవన్ 4-1తో తనారత్ సెంగ్‌ఫెట్(థాయ్‌లాండ్)పై గెలిచి శుభారంభం చేశాడు. బాక్సింగ్ పవర్‌హౌజ్‌లుగా పేరు గాంచిన చైనా, కజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్, దక్షిణకొరియా, థాయ్‌లాండ్ బరిలో ఉన్న ఈ టోర్నీలో భారత్ 19 మంది బృందంతో బరిలోకి దిగింది.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.